



పేదలకు ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వాణి తెలిపారు. శుక్రవారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సూచనలతో తోటపల్లి గూడూరు కోడూరు పంచాయతీ మహలక్ష్మి పురం శరత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ లో లీగల్ సర్వీసెస్ డే ను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా వాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవల దినోత్సవం నవంబర్ 9న ఇండియన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987 అమలులోకి వచ్చిందని తెలిపారు. ప్రతి నవంబర్ 9న అన్ని లీగల్ సర్వీసెస్ అధికారులు లీగల్ సర్వీసెస్ డేగా జరుపుకుంటారన్నారు. ఏ అవసరమైనా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ నారాయణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జయకృష్ణ, లేబర్ ఆఫీసర్ రామారావు, వన్ స్టాప్ సెంటర్ సఖి ఏఓ షహనాజ్, ఉమన్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీస్ సిబ్బంది, ఎన్జీవోఎస్ అడ్వకేట్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి

వ్యవసాయం,ఇరిగేషన్ కీలకం..!

◆ గృహ నిర్మాణంపైనా చర్చ

◆ నేడు డిఆర్‌సి సమావేశం

ముంథా తుపాన్..ఇరిగేషన్ సమస్యలు... గృహనిర్మాణంలో అవకతవకలు... ఇలాంటి ప్రధాన సమస్యలపైనే నేడు డిఆర్‌సి (జిల్లా సమీక్షా సమావేశం) జరగనుంది. నేడు ఉదయం 11 గంటలకు స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జ్ మంత్రి ఎండి ఫరూక్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపిలు,ఎం ఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు జిల్లా అధికారులు హాజరు కానున్నారు. ఎంతో కీలకమైన సమావేశంలో సభ్యులు ఏ అంశాలకు ప్రాధాన్యత ఇస్తారో చూడాలి...



జెడ్‌పి కార్యాలయం (ఫైల్)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే డిఆర్‌సి సమావేశంలో పలు ప్రధాన అజెండాలు తీసుకొచ్చారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ, మైక్రో ఇరిగేషన్ , ఇరిగేషన్, సోమశిల, టిజిపి, గృహనిర్మాణం, పరిశ్రమలు, జాతీయ రహదారి, మెడికల్ అండ్ హెల్త్, విద్యాశాఖ అంశాలను అజెండాల్లో చేర్చారు. ఇటీవల వచ్చిన ముంథా తుపాన్ కారణంగా సుమారు రూ 101 కోట్లు నష్టం జరిగింది. టిఆర్ 27 కింద కలెక్టర్ రూ.3 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిసింది. సుమారు 3500 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆకుకూరలు, పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. వీటిపై చర్చసాగే అవకాశం ఉంది. వ్యవసాయశాఖకు సంబంధించి యూరియా కొరత రానుంది. ఇప్పటికే జిల్లాకు కేటాయింపులు జరిగాయి. రానున్న కాలంలో యూరియా అవసరం, ప్రభుత్వ కేటాయింపులు విషయాలపైనా చర్చసాగనుంది. ఇరిగేషన్‌కు సంబంధించి అనేక పనులు పెండింగ్ ఉన్నాయి. నిధుల కేటాయింపులు, లస్కర్ల జీతాలు వంటి సమస్యలు గత సమావేశాల్లోనూ చర్చకు వచ్చాయి. దీనిపై అధికారపక్ష ఎంఎల్‌ఎలు మాట్లాడారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు 95 శాతం పూర్తి చేశారు. ధాన్యం కొనుగోలు విషయాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ పనులు పూర్తి చేయడం, 18 నెలల నుంచి సాగుతూనే ఉంది. స్వయంగా ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చినా ఇప్పటికీ ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. ప్రధానంగా గృహ నిర్మాణంపై అధికార పక్ష ఎంఎల్‌ఎలు గుర్రుగా ఉన్నారు. గత ప్రభుత్వంలో గృహనిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయనే విమర్శలున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఇందుకు సంబంధించి విచారణ చేయిస్తోంది. సుమారు రూ.8 కోట్ల విలువైన సిమెంట్, స్టీల్ దెబ్బతింది. ఈ నేపథ్యంలో వాడివేడిగా చర్చ సాగే అవకాశం ఉంది.ఎన్‌టిఆర్ హౌసింగ్ పంపిణీ, తదితర అంశాలు ఉన్నాయి. పరిశ్రమల సంబంధించి కరేడు భూములు, బిపిసిఎల్ వంటి సమస్యలున్నాయి. ప్రతిపక్ష సభ్యులు డిఆర్‌సికి డుమ్మా కొడుతున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న డిఆర్‌సి ఎలా సాగుతుందో చూడాలి.

10న ‘చంద్రన్న పల్లె వెలుగు’

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

“ చంద్రన్న పల్లెవెలుగు” ను ఈనెల 10న ప్రారంభిస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చినతరువాత ప్రజలకు కరెంటు కష్టాలు లేకుండా చేసేందుకు 3-ఫేజ్ , 24 గంటల కరెంటు కోసం రూ 9,139 కోట్లతో వ్యయంతో రాష్ట్రమంతటా కరెంటు పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నెల్లూరు రూరల్ లో రూ 50 కోట్లు నిధులతో 18 గ్రామాల్లో 3 డివిజన్లల్లో 80 వేల మంది ప్రజలకు ప్రయోజనం జరుగుతుందన్నారు. ఈ పనులు పూర్తి చేసి ఈనెల . 10వ తేదీ ఉదయం 10 గంటలకు కొడూరుపాడు వద్ద ప్రజలకు అంకితం చేయబోతున్నామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు: ఏపి ప్రభుత్వ పొరుగు సేవల ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా భీమన మల్లికార్జునరావు (గృహ నిర్మాణ శాఖ) ప్రధాన కార్యదర్శిగా పొట్టేళ్ల మస్తానయ్య(పశు సంవర్ధక శాఖ) వారితో పాటు మరో 15 మందితో జిల్లా కార్యవర్గ ఏర్పాటు చేసుకున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-నెల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్ వైజర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో హేనాసుజన్, బాలల సంరక్షణ అధికారి సురేష్, నోడల్ అధికారి అనూరాధ, లీగల్ కౌన్సిలర్ ప్రియాంక, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: చింతా రెడ్డిపాలెం మెడికవర్ హాస్పిటల్ దగ్గర రోడ్డు ప్రమాదాలకు గురై ఎంతో మంది ప్రాణాలు అవయవాలు కోల్పోయినప్పటికీ అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వెంటనే ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ముందుకు వచ్చి ఆ పనులను వెంటనే ప్రారంభించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.పి నరసింహా, నాయకులు సురేంద్ర, బాబులు, రాజేష్ ,శీను ,కుమార్ ,సతీష్ ,తిరుపతయ్య, వెంక టేష్, ఖాజావల్లి, మాజీ నాయకులు నాగేశ్వరరావు, జాఫర్ ,సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అక్టోబర్ సోషలిస్టు విప్లవం సాధించిన విజయాలపై సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

అక్టోబర్ సోషలిస్టు విప్లవం సాధించిన విజయాలపై సదస్సు డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సభలో మాజీ శాసనమండలి సభ్యులు విటపు బాలసుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు..అక్టోబర్ సోషలిస్టు విప్లవం ఒక నూతన శకానికి నాంది పలికిందన్నారు. రష్యాలో లెనిన్ నాయకత్వంలో జరిగిన సోషలిస్టు విప్లవం ప్రజలందరికీ భూమి పంపకం, ప్రభుత్వ ఆధీనంలో పరిశ్రమలు, ఎనిమిది గంటల పని విధానం, అందరికీ ఆరోగ్యం, విద్య ,ఇల్లు లాంటి మౌలిక సదుపాయాలను ప్రజలందరికీ కల్పించిందన్నారు. ఆ స్ఫూర్తితో అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయని, చైనా వియత్నం, క్యూబా, కొరియా లాంటి దేశాలలో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. వలస విముక్తి ఉద్యమాలు జరిగే ప్రపంచంలో అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందాయని, అనేక దేశాలలో సోషలిస్టు వామపక్ష ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. అమెరికా నడిబొడ్డున ఒక డెమోక్రటిక్ సోషలిస్టు గా ప్రకటించుకున్న మందాని న్యూయార్క్ మేయర్ గా ఎన్నిక కావడం శుభ పరిణామం అని, మన పొరుగున ఉన్న శ్రీలంక ,నేపాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారానికి వచ్చాయని కొన్ని ఎదురుదెబ్బలు తగిలిన వాటి నుండి అనుభవాలు నేర్చుకొని కమ్యూనిస్టులు ముందుకు సాగుతారని పేర్కొన్నారు. రష్యా విప్లవస్ఫూర్తితో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. కమ్యూనిస్టులు అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఈ దేశంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారని తెలియజేశారు. కమ్యూనిస్టు భావాలను సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రజలలోకి విరివిగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు, మాదాల వెంకటేశ్వర్లు ప్రసంగించారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు

కలెక్టరేట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-నెల్లూరు: కలెక్టరేట్‌కు నిత్యం వచ్చే వృద్ధులు, వికలాంగులు, ప్రజల సౌకర్యార్థం లిఫ్ట్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మించిన లిఫ్ట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులు, తేదేశాల మేరకు లిఫ్ట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం (శిక్షణ, ఉపాధి, ప్రమోషన్ సొసైటీ) ఎస్వీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వారి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం,కెరీర్ గైడెన్స్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్ష వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రవికుమార్ విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తు పట్ల అంకితభావంతో ఉండాలని, ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని, సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారి లక్ష్యాలను ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని మెరుగుపరుచుకోవాలని ఉద్బోధించారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు సమాజంలో ఉన్నటువంటి దుష్ప్రభావాన్ని గమనించి వాటికి దూరంగా ఉండాలని, మంచి ఆలోచనలని, గొప్ప వ్యక్తుల చర్యలని ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. సెట్ నెల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు విజేతల గాథల్ని చదివి స్ఫూర్తి పొందాలన్నారు. సెట్నల్ సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్, మాట్లాడుతూ యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు ఏ విధంగా తయారు కావాలి,విద్యార్థినీ విద్యార్థులు వాటి పోటీని ఎదుర్కొనే విధంగా ఎలా ఉండాలి అనే విషయాన్ని విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. యూత్ ఫెస్టివల్ లో పాల్గొన్న విద్యార్థులు టి .సంధ్య, కటారి శివకుమార్ లకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి. రాజగోపాల్, రత్న కరుణ కుమార్, డాక్టర్ ఎన్వి శ్రీహరి, డాక్టర్ ఎన్ తిరుపతి స్వామి, డాక్టర్ ఐ అనూష, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం..

ప్రజాశక్తి-కందుకూరు: రాష్ట్రంలో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం రంగాలలో దూసుకు వెళుతుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం వైసీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసరావు తో పాటు 10 కుటుంబాల వారు వైసీపీ పార్టీని వీడి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.ముందుగా పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు టిడిపి కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ అమలుకు కృషి

ప్రజాశక్తి-కందుకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా విజన్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించారని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.కందుకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం విజన్ యాక్షన్ ప్లాన్ సెంటర్ ను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు రాష్ట్ర అభివద్ధికి సిఎం తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఎంపిపి ఇంటూరి సుశీల, ఎంపీడీఓ రత్న జ్యోతి, యంగ్ ప్రొఫెషనల్ అనిల్ కుమార్, విజన్ స్టాఫ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్: రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం, చేవూరు గ్రామంలో పోరంబోకు భూములకు, పట్టా భూములతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలని, సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చేవూరు గ్రామానికి వచ్చినటువంటి, తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి, సిపిఎం ఆధ్వర్యంలో దళిత రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, 100 సంవత్సరాల నుండి, తాతలు ముత్తాతల దగ్గర నుండి, సర్వే నెంబర్ 591 లో, 18 ఎకరాల 60 సెంట్లు పోరంబోకు భూమిని, దళిత రైతులు మామిడి తోటలు వేసి సాగు చేస్తున్నారని, ఈ భూములకు, లాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా ఉచితంగా ప్రభుత్వం వారు స్వాధీనం చేసుకోవడం సరైనది కాదన్నారు. ఈ భూమి కోల్పోయిన 14 మంది దళిత రైతులు వీధులు పాలై ఆత్మహత్యలే శరణ్యమని సిపిఎం నాయకులు అన్నారు. దీనికి స్పందించిన తహశీల్దార్, ఇది పోరంబోకు భూములు అయినందున ప్రభుత్వం వారు, అంటే నష్టపరిహారం ఇవ్వలేరని, కంపెనీ వాళ్ళ చేత, ఎకరాకు రెండు లక్షల రూపాయలు నష్టపరహారం ఇప్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. దీనికి దళిత రైతులు నిరాకరించారు. పట్టా భూములతో సమానంగా మాకు కూడా ఇవ్వాలని దళిత రైతులు డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దారు శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు అర్జీ పెట్టండి, దీనిపై మీ అభిప్రాయాలను తెలియజేస్తూ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలియజేశారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, భూములతో సమానంగా దళిత రైతులకు కూడా నష్ట పరిహారం చెల్లించాలి, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరిక చేశారు. కార్యక్రమంలో సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, దళిత రైతులు, డి. దాసు, గండికోట కృష్ణయ్య, లేళ్ల పల్లి ఆదిలక్ష్మి, వెంకాయమ్మ, రవీంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కష్టంవస్తే, ఆదుకోవడంలో ముందుంటారని మరోసారికందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నిరూపించుకున్నారు.ఉలవపాడు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే నాగేశ్వరరావు రెండో రోజు శుక్రవారం పమర్శించారు.రెండు కాళ్లు విరిగి ఆపరేషన్ చేయించుకున్న రావినూతల బేబీ ప్రసన్న, ఒక కాలు విరిగిన రావినూతల లక్ష్మిలను ఆప్యాయంగా పలకరించి ధైర్యం చెప్పారు. ఆసుపత్రి డాక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ట్రీట్మెంట్ గురించి తెలుసుకుంటున్నానని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితుల ట్రీట్మెంట్ వివరాలు తెలుసుకున్నారు.ఆయన వెంట టిడిపి నాయకుడు పొడపాటి సుధాకర్‌లు ఉన్నారు.

కేన్సర్ల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు: కేన్సర్ అనేది శరీరంలోని కణాలు అదుపుతప్పి నిరంతరం పెరుగుతూ ఉండే పరిస్థితి అని, సమయానికి గుర్తిస్తే చికిత్స సాధ్యమే అని నారాయణ హాస్పిటల్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి. గురుసాయి రత్నప్రియ పేర్కొన్నారు. శుక్రవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పియంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా), నారాయణ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యపురిలోని సుస్మిత నర్సింగ్ కాలేజీలో కేన్సర్ పై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి. గురుసాయి రత్నప్రియ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ఏ విధంగా స్వీయ పరీక్షలు నిర్వహించుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్, హాస్పిటల్ ఏజిఎం అలిమిలి చంద్రశేఖర్ రెడ్డి, పి.హెచ్.పి జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక పొదలకూరురోడ్డు ప్రాంతంలోని ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలోని బాలికలకు కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడు వాపు వ్యాధులు వస్తాయని తెలియజేశారు. డెంగీ దోమలు పగటి పూట కుడుతాయని, దోమల పెరుగుదలను లార్వా దశలోనే నిర్మూలించడం ద్వారా కీటక జనిత వ్యాధులను నివారించడం సాధ్యమౌతుందన్నారు. ముఖ్యంగా హాస్టల్ పరిసరాలలో కృత్రిమ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా పట్టణ విభాగం ఆరోగ్య పర్యవేక్షలు శ్రీధర్, ఆరోగ్య సహాయకులు నంద కుమార్, హాస్టల్ ప్రిన్సిపల్ సుజాత, హాస్టల్ ఏఎన్ఎం అనూష, సచివాలయం ఏఎన్ఎం ప్రశాంతి,ఆశా కార్యకర్త యమున పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి


ప్రజాశక్తి-కందుకూరు: పట్టణం లోని మొబైల్ షాపులు యునియన్ నాయకులు, ఆ సంస్థ సభ్యులు బిఎస్ఎన్ఎల్ షాపుల వ్యాపారులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని శుక్రవారం కలిశారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేస్తూ ఆయనకు వినతిపత్రం అందజేశారు.బిఎస్ఎన్ఎల్ షాపింగ్ కాంప్లెక్స్ లో మొత్తం 10 షాపులు ఉన్నాయన్నారు. అందులో నాలుగు షాపులు మొబైల్ షాపులు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. మూడు రోజుల క్రితం మున్సిపల్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ కు తాళం వేయడంతో మొబైల్ షాపుల తోపాటు మిగిలిన షాపుల వారంతా రోడ్డున పడ్డారని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతినెలా అద్దెలు సక్రమంగా చెల్లిస్తున్నామని చెప్పారు. అంతేగాక అడ్వాన్సు కింద మూడు నుండి ఐదు లక్షల రూపాయలు వైసిపి నాయకుడు షేక్ రఫీకి ఇచ్చామని ఎమ్మెల్యేకి తెలిపారు. షాపులు మూసి వేయడంతో తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఈ విషయంపై బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.



ఎంఎల్‌ఎకి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు: యువతరం ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధన కు వ్యూహాత్మకంగా, ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ నాగూర్ వలి అన్నారు. నెల్లూరు జిల్లా యువజన సంక్షేమ శాఖ నేతృత్వంలో శుక్రవారం టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన సంక్షేమ శాఖ సిఇఒ .ఎ. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ దిశను దశను మార్చే శక్తి యువతరానికి ఉందన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ బాధ్యులు, రెడ్ రిబ్బన్ క్లబ్ నోడల్ అధికారిణి సయ్యద్ షాలిమా సుల్తాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

పలుచోట్ల డివైఎఫ్ఐ జెండాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు: రూరల్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్ కేంద్రాలల్లో డివైఎఫ్ఐ జెండాలు ఆవిష్కరించారు. శుక్రవారం బొల్లినేని సెంటర్, రామకోటినగర్, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాలల్లో డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి గోను చైతన్య ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ ఆవిర్భావదినోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ మాట్లాడుతూ డివైఎఫ్ఐ 1980 నవంబర్ 1, 2,3 తేదీలలో పంజాబ్ రాష్ట్రంలో లూథియానా గ్రామం నందు ఏర్పడింది అన్నారు.అందరికీ విద్యా అందరికీ ఉపాధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తుందన్నారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు మాలకొండయ్య, సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు నాగేశ్వరావు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల పోరాటానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం రూరల్ నాయకులు పెంచల నరసయ్య, డివైఎఫ్ఐ రూరల్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు బాషాభాయ్ ఖాదర్బాషా. గోపాల్. గయాజ్. అప్పలనాయుడు రాజు. రాంబాబు. జోగారావు. మోహన్. అప్పన్న. భాస్కర్. కోటయ్య. బాబు. వంశీ. బాబు. కాండందాస్. మధు. గాంధీ తదితరులు పాల్గొన్నారు

ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-నెల్లూరు :కుమార్తె ప్రేమ వివాహ విషయంలో భార్యతో తగాదా పడి, ఆటో జాకీ రాడ్‌తో దాడి చేయడం వల్ల ఓ మహిళ మృతి చెందిన కేసుకు సంబంధించి నిందితుడు రాపూరు శ్రీనివాసులు అలియాస్ చినోడుకి జీవిత ఖైదు, జరిమానా రూ.1000లు విధిస్తూ 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎంఎ సోమశేఖర్ తీర్పు ఇచ్చారు. 2018లో నెల్లూరు నుండి కె.ఆర్.పురం వెళ్తున్న మార్గమధ్యంలో ఆటోను ఆపి, ఇద్దరూ ఆటో నుండి దిగగా, అప్పుడు నిందితుడు ఆటో జాకీ రాడ్ తీసుకొని భార్య తలపై దాడి చేసి ఆమెను అక్కడికక్కడే చంపినట్లు, ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనుబోలు స్టేషన్ నందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. నేడు 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు వారు ముద్దాయికు జీవిత ఖైదు, 1000/- జరిమానా విధించడం జరిగింది.

వైభవంగా లక్ష కుంకుమార్చన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు నగరంలోని వి.ఆర్. సి మైదానం వేదికగా నిర్వహిస్తున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఉదయం.. విశేష రుద్రహోమం , 108 దంప తులచే శ్రీ మహా లక్ష్మి అమ్మవారి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. విఆర్ కళాశాల మైదానంలోని లక్ష దీపోత్సవం ప్రాంగణానికి చేరుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

న్యాయం చేయండి సారూ..

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

తనను ఆర్థికంగా మోసం చేసిన వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని పొదలకూరు రోడ్డు, నేతాజీ నగర్ ప్రాంత బాధితురాలు ఎం.నాగభూషణమ్మ కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న, తన స్నేహితురాలు ఓల్డ్ ఏజ్ హోం పెడదామని తనకు పదే పదే గతంలో తెలిపిందన్నారు. ఆ హోం ద్వారా వృద్ధులకు సహాయ పడతానని ఆమె తెలిపింద న్నారు.నగదు తీసుకున్న ఆమె ఓల్డ్ ఏజ్ హోం ఏర్పాటు చేసి, నిర్వహించకుండా కాలయాపన చేసింది. ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వాలని ఆమెను కోరినట్లు తెలిపింది. ఆ నగదును ఆమె ఇవ్వలేదు. పైగా తనను చంతానని బెదిరించారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

వందేమాతరానికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-నెల్లూరు: స్వాతంత్ర్య సంగ్రామంలో భారతీయులను ఏకతాటిపైకి తీసుకొచ్చి స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన మహోన్నత దేశభక్తి గేయం వందేమాతరమని కలెక్టర్ హిమాన్షు శుక్ల వందేమాతరం గేయం ఔన్నత్యాన్ని కీర్తించారు.వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో కలెక్టర్ హిమాన్షు శుక్ల, అధికారులు, సిబ్బంది వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ వందేమాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వందేమాతరం దేశభక్తి గేయాన్ని ఆలపించి ఆ గేయం గొప్పతనాన్ని, కీర్తిని మరొకసారి గుర్తుకు తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. వందేమాతరం గీతాలాపన అనంతరం జిల్లా కలెక్టర్ సిబ్బంది అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో డిఆర్ఓ విజయకుమార్, కలెక్టరేట్ పరిపాలనాధికారి తుమ్మా విజయకుమార్, మత్స్యశాఖ జేడి శాంతి, ఐఅండ్‌పిఆర్ డిడి వేణుగోపాల్‌రెడ్డి, డిఇ శివశంకర్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



డిఎంహెచ్ఓ కార్యాలయంలో: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ వి. సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో డిఎల్ఎటివో డాక్టర్ ఖాదర్ వలీ, డీపీఎంఓ డాక్టర్ ఎం. రమేష్, డెమో కె. కనకరత్నం, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో :ఎస్పి డాక్టరు అజితా వేజండ్ల ఆధ్వర్యంలోభారతమాత చిత్రపటానికి పూల మాల వేసి, పుష్పాంజలి అర్పించారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి.సిహెచ్.సౌజన్య , రూరల్ డిఎస్పి జి. శ్రీనివాసరావు ,ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్ , ఏఓ.చంద్రమౌళి, సిఐ, ఆర్ఐలు, ఇతర అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ ఇన్‌ఛార్జ్ సీఈఓ ఎల్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గీతం “వందే మాతరం” 150వ వార్షికోత్సవం కార్యక్రమం నిర్వహించారు. 1875లో బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ రాసిన ఈ గీతం “వందే మాతరం” అనే రెండు పదాలు భారతదేశం అనే తల్లికి వందనం చేసే ఒక గాఢమైన భావనను వ్యక్తం చేస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు, నూనె మల్లికార్జున్ యాదవ్, గునుకుల కిషోర్ , చంద్ర శేఖర్ రెడ్డి, కృష్ణా రెడ్డి రాజేష్ , పేనేటి శ్రీకాంత్, వీర మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు: ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వారి కార్యాలయం లో ఆర్టీవో టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వందేమాతర గీతం రూపుదిద్దుకొని 150 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వారి కార్యాలయంలో శుక్రవారం వందేమాతర గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్‌టిఒ టీవీఎన్ లక్ష్మీ, ఎం వి ఐ జె అనిల్ కుమార్ మాట్లాడారు.కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, గౌతమ్ స్కూల్ విద్యార్థులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి-గుడ్లూరు: వందేమాతర గీతం ఆవిర్భవించి 150 సంవత్సరాలు ఆయన సందర్భంగా గుడ్లూరులో ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు విద్యార్థులు డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు శుక్రవారం నిర్వహించారు. గుడ్లూరు బస్టాండ్ సెంటర్ కూడలిలో ఏర్పాటుచేసిన మానవహారం ప్రజలు నాకట్టుకుంది వందేమాతరం గీతం విశిష్ట గురించి ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు సిఐ రంగారావు ప్రసంగించారు.

హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-నెల్లూరు: చేనేత కార్మికులకు ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు ఎడి ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆగస్టు ఏడో తేదీన చేనేత జాతీయ దినోత్సవం రోజు చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచితంగా హామీ ఇచ్చారు.నెల్లూరు లోని ఆరు ఎకరాల 90 సెంట్లు ఆప్కో స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి, ఇల్లు లేని ప్రతి చేనేత కార్మికునికి మూడు సెంట్లు భూమిలో పక్కా ఇల్లు తో పాటు మగ్గం షెడ్ ని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి, వస్త్ర ఉత్పత్తులపై రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు పరచాలి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత ఉత్పత్తులపై విధించిన జీఎస్టీ ని వెంటనే రద్దు పరచాలి, లేక రీయింబర్స్మెంట్ చేయాలి నేతన్న నేస్తంలో భాగంగా 25000 రూపాయలు ప్రతి చేనేత కార్మికునికి, అద్దె ఇంట్లో మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికునికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.చేనేత కార్మికురాలికి ప్రసూతి సమయంలో ఆరు నెలలు 3000 రూపాయలు లెక్కన అందజేయాలన్నారు.చేనేత ముద్ర లోన్లు తీసుకున్న ప్రతిసారి సబ్సిడీని వర్తింపజేయాలన్నారు. రాష్ట్రంలోని సహకార సంఘాలకు రావా ల్సిన 127 కోట్ల రూపాయలు వడ్డీతో పాటు విడుదల చేయాలి కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు రాబోవు బడ్జెట్లో 2000 కోట్ల రూపాయలు ప్రకటించాలన్నారు.. సౌత్ మోపూర్, నారాయణరెడ్డి పేట, వావిళ్ళ బుచ్చిరెడ్డిపాలెం, పెద్ద పుత్తేడు, మనుబోలు, మడమనూరు, కసుమూరు తదితర 10 గ్రామాల నుండి చేనేత కార్మికులు వందమంది పాల్గొన్నారు. ఎ పి.చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పడవల సుబ్రహ్మణ్యం, ఎ.పి.చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు పముజుల హరి, జిల్లా సహాయ కార్యదర్శి మన్యం రాంబాబు, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బూదవరపు బాలాజీ, సోమా గోపాలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం హ్యాండ్లూమ్ డిఓ కు మెమోరాండం అందజేశారు.



ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు, నాయకులు

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : అత్యుత్తమ ఫలితాలతో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బిసికాలనీ పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన ప్రార్థన సమయానికి పాఠశాల చేరుకుని వందేమాతరం గీతాలపన 150 సంవత్సరాల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు. వందేమాతరం గేయ రచయిత బకించంద్ర ఛటర్జీ స్వాతంత్రోద్యమ సమయంలో దేశానికి చేసిన సేవను ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవుల అక్రమ రవాణాపై దాడి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని జాతీయ రహదారి మీద బుధవారం ఉదయం అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటైనర్ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. కోవూరు సిఐ వి.సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రైనీ ఎస్ఐ గోవర్ధనగిరి తనిఖీలు నిర్వహించగా, వాహనంలో 15 గేదెలు, ఆవులు అక్రమంగా బయటపడ్డాయి. వెంట నే వాహనాన్ని కోవూరు పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు, మృగ సంరక్షణ చట్టాలు, రవాణా నిబంధనలను ఉల్లంఘిస్తూ గోవులను అక్రమంగా తరలించినట్లు నిర్ధారించారు. కంటైనర్ వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంగవీటి నరేంద్రను కలిసిన దామిశెట్టి

ప్రజాశక్తి-కావలి : వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్రను వైసిపి ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామిశెట్టి సుధీర్ నాయుడు మర్యాదపూర్వకంగా విజయవాడలోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ నాయుడు మాట్లాడుతూ నరేంద్రతో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా చేయాల్సిన కృషి గురించి, అదేవిధంగా సామాజికంగా కాపులకు అండగా ఉండడం, తద్వారా వారిని పార్టీకి దగ్గరచేసి, రాబోయే 2029 ఎలక్షన్లలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయటా నికి మనవంతు చేయవలసిన కృషి గురించి చర్చించామన్నారు.

ఉలవపాడులోకి బస్సులు..

ప్రజాశక్తి-కావలి : ఒంగోలు వెళ్లే పల్లెవెలుగు బస్సులతోపాటు, విజయవాడ వెళ్లే సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు అన్నీ కావలి డిపో పరిధిలోని ఉలవపాడు గ్రామంలోకి వెళతాయని ఏపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ తెలిపారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఆదేశం మేరకు కావలి, నెల్లూరు 1, 2 డిపో బస్సులను అన్ని సమయాల్లో ఉలవపాడు గ్రామంలోకి పంపుతున్నట్లు, కావున ఉలవపాడు వెళ్ల ప్రయాణికులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సురక్షితమైన ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-కలిగిరి : కలిగిరి మండలం పెద్దపాడు గ్రామ సమీపంలో కావలి నుండి కలిగిరి వైపు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు, అతివేగంతో వెళుతూ రోడ్డు పక్కన ఉన్న ప్రమాద హెచ్చరిక బోర్డును ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మనోజ్ (24) అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు మురారి పెంచలప్రసాద్, నక్కా కిరణ్‌లు తీవ్ర గాయపడ్డారు. వీరు ముగ్గురూ కలిగిరి మండలం జీర్లవారిపాలెంకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. గాయపడిన ఈ ఇద్దరినీ వింజమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి నక్కా కిరణ్‌కు బలమైన గాయాలు కాగా అతనిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తిని పోస్ట్‌మార్టం ఆత్మకూరుకు తరలించారు.

బ్యాంక్ రుణాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : వివిధ రకాల బ్యాంకు రుణాలపై ఆరు మండలాల వెలుగు సిబ్బందికి బ్యాంక్ మ్యానేజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక స్త్రీ శక్తి భవనంలో వెలుగు ఎపిఎం శారా ప్రవంతి అధ్యక్షతన సమావేశం ప్రారంభించి అనంతరం బ్యాంకు మేనేజర్ మణికంఠ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జెఎంఎల్ బిసి సమావేశం క్లస్టర్ పరిధిలో బ్యాంకర్ల సమావేశం జరుగుతుందన్నారు. ముందుగా 6 మండలాల ఎపిఎంలు బ్యాంకు మేనేజర్లు సంబంధిత సిబ్బందితో మండలాల వారిగా రివ్యూను నిర్వహించి బ్యాంకు లింకేజీలు సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇఫిఆర్‌డి ఎస్.మోహన్ రావు, కార్యాలయ సిబ్బంది, ఆరు మండలాలు బ్యాంక్ మేనేజర్లు, వెలుగు ఎపిఎంలు, సిసిలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టాటా మ్యాజిక్‌ను ఢీకొన్న కారు

- నలుగురు ఉపాధ్యాయులకు గాయాలు - వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-కొడవలూరు : కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం టపా తోపు హైవే వద్ద శుక్రవారం కావలి నుండి నెల్లూరు వైపు వెళుతున్న సఫారీ కారు అతివేగంగా నెల్లూరు నుండి వస్తున్న టాటా మ్యాజిక్ హైవే క్రాస్ వద్ద విడవలూరు వైపు క్రాస్ అవుతున్న సమయంలో కారు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్‌లో ఉన్న ఏడుగురు ఉపాధ్యాయులలో నలుగురికి గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని పోలీసులు తెలిపారు. ఎస్ఐ కోటిరెడ్డి వివరాలు మేరకు.. విడవలూరు మండలంలోని రామతీర్థం జెడ్‌పి హైస్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నెల్లూరు నుండి టాటా మ్యాజిక్‌లో విధులకు వెళుతుండేవారని అలాగా శుక్రవారం కూడా విధులకు వెళు తుండగా నార్త్ రాజుపాలెం హైవే క్రాస్ వద్ద టాటా మ్యాజిక్‌ను కారు ఢీకొట్టడంతో టాటా మ్యాజిక్ బోల్తా బడి మ్యాజిక్‌లో ఉన్న భారతి శ్రీలక్ష్మి రవికుమార్ వెంకటేశ్వర్లు గాయాలైనట్లు ఆయన తెలిపారు. వెంకటేశ్వర్లు శ్రీలక్ష్మి ల పరిస్థితి ప్రమాదకరంగా ఉందన్నారు. రామతీర్థం హైస్కూల్లో పనిచేస్తున్న పోలేపల్లి శ్రీనివాసులు ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సూచనలతో బోగోలు మండలం బోగోలు గ్రామపంచాయతీలోని మణికంఠ నగర్‌లో కోటిసంతకాల కార్యక్రమాన్ని వైసిపి నాయకులు శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, సీనియర్ నాయకులు సల్మాన్ రాజు, తోటపల్లి సాగర్, చిన్ని, సురేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ట



ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని సోమవరప్పాడులో నూతనంగా నిర్మించిన శ్రీ గంగా పార్వతి సమేత సోమనాథ స్వామి శ్రీ సాయిబాబా స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు వెల్లివిరుస్తాయని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆలయ విగ్రహాల మహా ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం వారు సోమవరపాడుకు విచ్చేశారు. గ్రామానికి చెందిన ఆలయ నిర్మాణ కర్తలు చేవూరు జనార్ధన్ రెడ్డి సులోచనమ్మ దంపతుల చేతుల మీదుగా నిర్మించిన ఆలయాలు గ్రామ అభివృద్ధికి ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పాటున అందిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు భక్తులు దాతలు సమిష్టి కృషి చేసి ఆలయ నిర్మాణం పూర్తి భావించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వీరికి గ్రామస్తులు మేళతాళాలతో స్వాగత సత్కారాలు చేశారు.

దళారుల కోసమేనా ఎటిఎస్ సెంటర్..

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ విమర్శలు

ప్రజాశక్తి-ముత్తుకూరు

దళారులు దోచుకునేందుకు అణువుగా వారి కోసమేనా కప్పల దొరువు ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టమ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందా.. అంటూ సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం ఈ సెంటర్ వద్ద నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రవాణా రంగం కార్మికులపై ఆర్థిక భారం మోపే ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టమ్ సెంటర్‌ను రద్దు చేయాలం టూ 24 గంటలు నిరసన కార్యక్రమం చేపట్టారు. వందలాది మంది ఆటో కార్మికులు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమా నికి విచ్చేశారు. ఆటో కార్మికుల నిరసనతో అక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు అయింది. ప్రణీత్ ఆథరైజ్డ్ టెస్టింగ్ సెంటర్ ప్రయివేట్ లిమిట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పెద్దఎత్తున ర్యాలీ, నిరసన కార్యక్రమం జరిగింది. 24 గంటలు నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు మాట్లాడారు. ఎటిఎస్ సెంటర్లో దళారులు రాజ్యం నడుస్తుందని ఆయన విమర్శించారు. ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రయివేటు ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల కొంతమంది దళారులుగా అవతారం ఎత్తి రవాణారంగం కార్మికులను దోచుకుంటు



నిరసన వ్యక్తం చేసిన ఆటో కార్మికులు

న్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ తరహాలోనే ఎఫ్‌సిలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్‌సిలు కోసం చలానా తీసుకుంటే అనివార్య కారణాలవల్ల ఎటిఎస్ సెంటర్‌కు రాకపోతే మళ్లీ చలానా తీసుకోవాల్సి ఉంటుందని దాంతో ఆర్థికభారం మోయాల్సిన పరిస్థితి రవాణారంగం కార్మికుల ఎదుర్కొంటున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఆధారంగా తీసుకున్న దళారులు సంవత్సరానికి రూ.2వేల నుంచి రూ.4వేల వరకు లంచాలు వసూలు చేస్తూ ఫిట్నెస్ కార్యకలాపాలకు పచ్చజెండా ఊపుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి గడ్డం అంకయ్య మాట్లాడారు. ప్రయివేట్ ఏజెన్సీకి ఇచ్చిన ఎటిఎస్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఎఫ్‌సిలు చేసే విధానం కంటే దోపిడి విధానం ఎక్కువగా ఉందని ఆయన ఆరోపించారు. సెంటర్ రద్దు చేసే వరకు పోరాటం ఆగేది లేదని అన్నారు.

సిఐటియుతో చర్చలు జరిపిన యాజమాన్యం

ఆటో కార్మికులు చేపట్టిన 24 గంటలు నిరసనతో ఎటిఎస్ సెంటర్ యాజమాన్యం దిగివచ్చింది. సెంటర్ వద్ద కార్మికులతో చర్చలు జరిపింది. రవాణా రంగం కార్మికులను ప్రయివేటు ఏజెన్సీ ఏ విధంగా దోచుకుంటుందో అనే విషయాన్ని సిఐటియు నాయకులు పూస గుచ్చినట్టుగా తెలియ జేశారు. వాహనాలు గేటు వద్దకు వస్తే అక్కడ నుంచి లోపలికి వెళ్లే వరకు అన్నివిధానాల్లో దోచుకుంటున్నారని సిఐటియు నాయకులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పనికి ఒకరేటు అనేవిధంగా ఉందని విమర్శించారు. ఎటిఎస్ సెంటర్‌లో ఆయా పనులు సంబంధించి ధరల పట్టిక పెట్టాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు లేకుండా చూస్తామని యాజమా న్యం హామీ ఇచ్చింది. దళారుల వ్యవస్థను కూడా అరికడతామని చెప్పింది. కార్యక్రమం లో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు కోలగట్ల సురేష్, కార్యదర్శి మారుబోయిన రాజా, ముత్తుకూరు మండల ఆటో యూనియన్ అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి బోయిన శ్రీనివాసులు, సిఐటియు నాయకులు శ్యాంప్రసాద్, గోడ భాస్కర్, జయరామయ్య, మస్తాన్ షా, ఏడుకొండలు, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు సహకరించాలి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ప్రాంత ప్రజల ఇలవేల్పు శ్రీ అంకమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, భక్తులు కోరుకుంటున్నట్లే ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతామని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శ్రీ అంకమ్మతల్లి ఆలయం చుట్టూ 19 షాపులు నిర్మించగా, వ్యాపారుల ఆహ్వానం మేరకు శుక్రవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎంఎల్ఎ పాల్గొని షాపులను ప్రారంభించారు. ఆలయంలో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం ఎంఎల్ఎ నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఆలయానికి విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కూడా డబ్బులేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఆలయ ఆదాయాన్ని పెంచేందుకు ప్రాంగణం చుట్టూ కొత్తగా 24 షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, వాటిలో 19 షాపుల నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ షాపుల ద్వారా అంకమ్మ తల్లి ఆలయానికి నెలకు రెండు నుంచి రెండున్నర లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. చిన్నచిన్న సమస్యలు ఎదురైన ప్రతికే అంకమ్మ తల్లి ఆశీస్సులతో ఇబ్బందులన్నీ తొలగిపోతున్నాయన్నారు. ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, భక్తులు ఆశించిన విధంగా అన్ని వసతులతో, ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునే లాగా కార్యక్రమాలు చేపడుతున్నామని ఎంఎల్ఎ తెలియజేశారు. మిగిలిన పనులు కూడా త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. ఇక కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రోడ్ల వెడల్పు కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధి కోసం రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని ఎంఎల్ఎ గుర్తు చేశారు. వాటితో ఇప్పటికే విడుదలైన నిధులతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా నడుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసులు, మంచిరాజు మురళి, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, మంగపాటి శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ట్రంప్ సుంకాల ప్రభావంపై సదస్సు



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కావలి : కావలిలో యుటిఎఫ్ ఆధ్వర్యం లో "ట్రంప్ సుంకాలు – భారతదేశంపై ప్రభావం" అనే అంశం మీద గురువారం రాత్రి యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.పరంధామయ్య చక్కగా విశ్లేషణ పూర్వకంగా వివరించారు. ఈ యుటిఎఫ్ సమావేశానికి జిల్లా కార్యదర్శి బిల్లు మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సంఘం కన్వీనర్ కె.నాగిరెడ్డి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో కావలి ప్రాంతంలోని అన్ని మండల శాఖల ఆఫీసు బేరర్స్, జిల్లా కౌన్సిలర్స్, సీనియర్ యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, జెవివి నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంపిడిఒ అభినందనలు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం ఆర్‌డిఒ ఆఫీస్ ప్రాంగణంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో కావలి పట్టణం క్రిస్టియన్‌పేటలోని సంయుక్త నృత్య కళానిలయం నాట్యగురువు గంగపట్నం లిఖిత, వారి స్టూడెంట్స్ చేసిన నృత్య ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యలకు సర్టిఫికెట్స్, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ఎంపిడిఒ సి.హెచ్.శ్రీదేవి మాట్లాడుతూ సంయుక్త నృత్య కళానిలయం చిన్నారులు 30 నిమిషాల పాటు అలుపెరుగకుండా చేసిన రెండు నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను, నాట్య గురువు గంగపట్నం లిఖితను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నెల్లూరు జిల్లా నెహ్రూ యువకేంద్రం యూత్ కో-ఆర్డినేటర్ ఆకుల మహేంద్ర రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, కార్యక్రమ నిర్వాహకులు జె.ఎన్.జె.ఎ ప్రయద్రిపిని మహిళా మండలి భాధర్ బీ, రహం చారిటబుల్ ట్రస్ట్ మహమ్మద్ అబ్దుల్ అలీమ్, ది పూర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ చేపూరు చిన్న, పరివర్తన సేవాసంస్థ మహమ్మద్ ఫజుల్ రెహ్మాన్, మీ కోసం సేవా సంస్థ రాయపాటి దిలీప్ నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు అభినందనలు తెలిపారు.


కమిషనర్‌కు ఎంఎల్ఎ అభినందన



ప్రజాశక్తి-కావలి : 'మొంథా' తుపాన్ నేపథ్యంలో కావలి పురపాలక సంఘం ముందస్తుగా తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శుక్రవారం సిఎం క్యాంప్ ఆఫీస్‌లో కావలి పురపాలక సంఘ కమిషనర్ శ్రీ.తావన్ కుమార్ "మొంథా సైక్లోన్ ఫైటర్" అవార్డు తీసుకున్నారు. అవార్డును అందుకొన్నందుకుగాను కావలి నియోజకవర్గ ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కావలి పురపాలక సంఘం కమిషనర్‌కు "మొంథా సైక్లోన్ ఫైటర్" అవార్డు పొందినందుకుగాను అభినందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహించుచున్న డి.వి.నాగేశ్వర రావుకు పుత్తూరు కమిషనర్‌గా పదోన్నతి వచ్చినందుకుగాను నగారా ఎంఎల్ఎ అభినందించారు.

జెసిబి సాయంతో పూడికతీత

- ఇళ్లల్లోకి మురుగు నీరు వార్తకు స్పందన



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ గ్రామం మాస్టర్ స్కూల్ అడ్రెస్ట్ సునీల్ ఇంటికి మధ్యలో ఉన్న మేజర్ కాలువను కాలువ పక్కన ఉన్న ఇళ్లల్లోకి వారు వారి స్వలాభం కోసం మట్టితో పూడ్చివేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగునీరు ఇళ్లల్లోకి వచ్చింది. ఈ ఘటనపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందన వచ్చింది. విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ అధికారులు చెప్పి జెసిబి సహాయంతో మేజర్ మురుగునీరు కాలువలో పేరుకొని ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టిని తీసివేసి ట్రాక్టర్ ద్వారా చెరువులోకి పంపారు. బిట్రగుంట రైల్వే తెలుగు మీడియం, రైల్వే కార్మికుల క్వార్టర్స్ వైపు నుండి వచ్చే మురికి నీరు మేజర్ కాలు నుండి చెరువులోకి పోతాయి. మురుగు కాలువ కాలువను మట్టితో పూడ్చడంతో లోతట్టు ఇళ్లల్లోకి మురికి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు గురయ్యారు. కాలువ పూడిక తీయడంతో సర్పంచ్ గండెరి మురుగులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-ఎంఎస్‌పేట : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపిపి పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో జరగాల్సిన సర్వసభ్య సమావేశం మండలంలోని అధికారులు అందరూ హాజరైనప్పటికీ, హాజరు కావాల్సిన ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా పడడం జరిగిందని, డిప్యూటీ ఎంపిడిఒ మునిరత్నం పత్రికాముకంగా తెలియజేశారు. తరువాత సమావేశం తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి



అరటితోటలో పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ధరలేక.. పెట్టిన పెట్టుబడి రాక.. కన్నీటి పర్యంతమవుతున్న అరటి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం తుపాను కారణంగా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి మాట్లాడారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 24 వార్డు పరిధి వెంకట్రావు పల్లె గ్రామానికి చెందిన ఆలూరి వెంకటేశ్వర్లు అనే రైతు 4.2 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారని తెలిపారు. కొద్దిపాటి ప్రభుత్వ సహాయంతో రెండు బోర్లు నీటి నిల్వ చేసుకునేందుకు ఒక పెద్ద ఏర్పాటు చుట్టూతా ఎలక్ట్రికల్ ఫెన్సింగ్ ఎకరాకు 1200 మొక్కల చొప్పున మొత్తం 6000 అరటి మొక్కలను నాటడమైనదని, ఇంట్లో ఉన్న బంగారం బ్యాంకులో కుదవ పెట్టి అప్పులు తెచ్చుకున్నారు. ఒక సంవత్సరం రోజులపాటు రాత్రింబవళ్లు కష్టపడి పంట దిగుబడి వచ్చే సమయానికి వారి ఊహలన్నీ తలకిందులు అయ్యాయని, ఒక కేజీ అరటి రూ.16కు తక్కువ లేకుండా మార్కెట్ దేశంలో ఉండగా, ఈ సంవత్సరం మిగతా ప్రాంతాలలో అదే ధర పలుకుతుండగా రాష్ట్రంలో అరటి ధరకు నిరాశే నిలిచిపోయిందని కిలో అరటి కేవలం రూ.6కు హోల్‌సేల్ వ్యాపారస్తులు అడుగుతున్నారు. కోత కూలీలు రవాణా ఖర్చులు కూడా రైతులే భరించుకోవాలని చెబుతున్నారన్నారు. ఎకరాకు రూ.2లక్షల పెట్టుబడి చొప్పున 4.2 ఎకరాల భూమికి రూ.10లక్షల పెట్టుబడి అయిందని, తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర లేకపోవడంతో అర్థం కాని స్థితిలో ఉండగానే మొంథా తుపాన్ విరుచుకుపడిందన్నారు. చెట్లు పడిపోవడం పండిన గెలలు విరిగిపోవడం చేలోనే పండ్లు కుళ్లిపోవడం గాలులకు పండిన కాయలు కూడా పగుళ్లు ఇవ్వడం ఇలా అరటి తోటను చూస్తే గుండె తరుక్కుపోతున్నారు. వ్యవసాయ అధికారులు హార్టికల్చర్ అధికారులను సంప్రదిస్తే అరటి తోటలకు నష్టపరిహారం ఇవ్వలేమని నిర్మొహమాటంగా ప్రకటించారని తెలిపారు. ఆ మేరకు దిక్కుతోచని స్థితిలో ఏపి రైతు సంఘం నాయకులను సంప్రదిస్తే తాము అరటి తోటను సందర్శించడం జరిగిందన్నారు. తుపాను కారణంగా ఆత్మకూరు నియోజకవర్గంలో వెయ్యి ఎకరాలలో వరిపంట దెబ్బతిన్నదని పంటనష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇచ్చే కార్యక్రమం కొనసాగుతున్నదని 33శాతం వరిపైరు దెబ్బతింటే కేవలం రూ.10వేలు నష్టపరిహారంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమన్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.35వేల అవుతుండగా మూడు పుట్ల ధాన్యానికి రూ.60వేల మద్దతు ధర ఉండగా రూ.10వేలు సహాయం ఏ మూలకు వస్తుందని ప్రశ్నించారు. దెబ్బతిన్న రైతాంగానికి పూర్తిస్థాయి నష్టపరిహారాన్ని అందించాలని ఆలూరి వెంకటేశ్వర్లు దీనస్థితిని మంత్రి పరిశీలించి వారికి రూ.10లక్షల నష్టపరిహారంగా ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పొలం సందర్శించిన వారిలో ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, సహాయ కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్, మండల రైతుసంఘం నాయకులు ఉన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధికి కృషి చేయాలని ఆత్మకూరు ఎంపిడిఒ రఫీఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధన గురించి రెండోరోజు శిక్షణా కార్యక్రమం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రఫీఖాన్ మాట్లాడుతూ 2030 నాటికి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 9 లక్ష్యాల సాధన కోసం గ్రామపంచాయతీలు పరిపాలన చేయాలని శిక్షణలో ఎంపిడిఒ రఫీఖాన్ తెలిపారు. కార్యక్రమంలో 9 మండలాల కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిపిలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



ప్రజాశక్తి-కావలి : తలసేమియా పీడిత చిన్నారులకు కావలి రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అమోఘమని కావలి అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య పేర్కొన్నారు. శుక్రవారం పోతుగంటి అలేఖ్య – శ్రీకాంత్ దంపతులు రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న ఏడుగురు చిన్నారులకు మందులు, పౌష్టికాహారం అందజేశారు. చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, తలసేమియా ఆస్పత్రిలో చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ పోతుగంటి అలేఖ్య మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి ఆహ్వానం మేరకు తలసేమియా డే కేర్ సెంటర్‌ను సందర్శించామని, గత సంవత్సరం కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించిన ఈ ఆసుపత్రి అనతికాలంలోనే ఆదరణపొందడం అభినందనీయమన్నారు. ఈ ఆసుపత్రికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, రక్తకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

ప్రజాశక్తి-కావలి



విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల పోటీలను కావలి వి.ఎస్.యు. పి.జి. కళాశాలలో యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ అల్లం శ్రీనివాసులు, రిజిస్ట్రార్ కె.సునీతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిలుమూరు శ్రీనివాసరావు అధ్యక్ష వహించారు. రిజిస్ట్రార్ సునీత మేడం మాట్లాడుతూ మహిళలు క్రీడల్లో బాగా రాణించి దేశానికి మంచిపేరు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకులుగా అమ్మాజీ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మణికంఠ, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు. సుమారు ఈ టోర్నమెంట్లో 16 కాలేజీల 300మంది ప్లేయర్స్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో కావలి సబ్ జైలులో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతావాణి హాజరై మంచి ప్రవర్తనతో నడచుకొని సమాజంలో గౌరవంగా జీవించాలని, అలాగే చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు దూరంగా వుండాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని, అక్కడ వున్న ఖైదీలకు తెలిపారు. అక్కడ అందించున్న ఆహార పదార్థలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబరు ఐ.సాయి ప్రసాద్, జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బపియ్య, లోక్ అదాలత్ సిబ్బంది, జైలు సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు

ఇటీవల మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక జెడ్‌పి పాఠశాలలో ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శుక్రవారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ మేరకు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ శ్రీనివాసరావు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయగా, కొంతమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం లో ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రషీద్, మండల ఉపాధ్యక్షులు రహంతుల్లా, ప్రధానోపాధ్యాయులు పద్మలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరంలో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నగరపాలక సంస్థ కమిషనర్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్ష నిర్వహించారు. భవన యజమానులు నిర్దేశించిన ప్లాను ప్రకారం నిర్మాణం జరిగేలా సిబ్బంది అందరూ చర్యలు తీసుకోవాలని, పిల్లర్ల దశలోనే గుర్తించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థకు ఆదాయ వనరులు పెరిగేలా, అనుమతుల ప్రకారం నిర్మాణం జరిగేలా చూడాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఓపెన్ ఫోరం కార్యక్రమంలో 19 సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కారాలను అందజేశారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం పై ప్రజలు హర్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథ రావు, ఏసీపీలు, టీపీబివోలు, వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమిత భవనాల తొలగింపు

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు భగత్ సింగ్ కాలనీ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన భవనాల తొలగింపు ప్రక్రియ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, కార్పొరేషన్ స్థలాలు, డ్రెయిను కాలువలు రోడ్లను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా తప్పనిసరిగా తొలగించి వేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఏ.సి.పీలు, టి.పి.బి.ఓ లు, వార్డు ప్లానింగ్, రెగ్యులైజేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

వాసిలి గ్రామం వద్ద రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఓ ఆటో సమీపంలోని పొలం పని చేసుకుంటున్న రైతులపై పడిపోవడంతో ముగ్గురు గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంటుంది. సమాచారం అందుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మకూరులో..

వందేమాతరం గేయం స్ఫూర్తి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వందేమాతరం గేయం స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలకు స్ఫూర్తినిచ్చిందని ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన వందేమాతర గీతాలాపన కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. మొదట వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలాభిషేకంతో నివాళు లర్పించారు. అనంతరం వందేమాతర గీతాన్ని విద్యార్థులు ఆలపించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సిఐ గంగాధర్, ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డిఇఒ ఎంవి జానకిరామ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ మేడం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఉదయగిరి : భారత స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిన 1875వ సంవత్సరంలో బకించంద్ర ఛటర్జీ రచించబడ్డ వందేమాతరం గీతంకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలో అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా శుక్రవారం సిఐ వెంకట్రావు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, ఎంఇఒ టి.వెంకటేశ్వర్లు భారత ప్రభుత్వం యావత్తు దేశప్రజలను భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో చేపట్టబడ్డ ఈ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. సిఐ వెంకట్రావు ఆధ్వర్యం లో ఎస్ ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మెయిన్ బజార్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ వెంకటేశ్వర్లు, డాక్టర్ పి.లావణ్య కుమారి సంస్కృతంలో ఉన్న వందేమాతర గీతాన్ని తెలుగులో వివరించి దాని ప్రాముఖ్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు.

ప్రజాశక్తి-ఎంఎస్‌పేట : మండల పరిధిలోని రాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థినీ విద్యార్థులతో కలిసి, వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలైన సందర్భంగా స్థానిక ఎస్ఐ ఎ.సైదులు, వారి సిబ్బంది, పాఠశాల సిబ్బంది వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్.రమణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో వందేమాతరం గేయం స్ఫూర్తిని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే.దొరస్వామి రెడ్డి, పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : వందనం... అభివందనం... వందేమాతరం అంటూ నినదించారు రామచంద్రాపురం పాఠశాల ఉపాధ్యాయ, విద్యార్థి బృందం. బంకించంద్ర చటర్జీ వందేమాతర గీతం రాసి 150 ఏళ్లు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవ సందర్భంగా పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయురాలు పి.వేదవతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 1875 నవంబర్ 7 నుండి 1947 ఆగస్టు 15 వరకు వందేమాతర ఉద్యమ జాతీయ, సాంస్కృతిక, చారిత్రక ఘట్టాలను ఉపాధ్యాయులు గండికోట సుధీర్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో నిర్మల, అరుణకుమారి, బ్రహ్మారెడ్డి, రసూల్, అహ్మదున్నీసా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వందేమాతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి రూరల్ సిఐ పాపారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బిట్రగుంట ఎస్ఐ ఎన్.ప్రభాకర్, టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, నాగులవరం వ్యవసాయ సహకార సంఘం సొసైటీ కమిటీ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎస్.ఆర్.కె. స్కూల్ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో భారతదేశానికి ఎంతో ప్రత్యేకమైన 150వ వందేమాతరం వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తహశీల్దార్ సోమ్లా నాయక్, సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్, టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డితో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని, విద్యార్థులతో కలిసి జాతీయ స్ఫూర్తిని రగిలించే వందేమాతరం గీతాన్ని ఉత్సాహంగా ఆలపించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం రవిశంకర్ రెడ్డి, టిడిపి ఐటీవింగ్ నాయకులు ముత్యాల విజయ్ మోహన్, పోలీస్ సిబ్బంది, అన్నీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి పాతూరు పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సిసి కేడేట్స్ వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సామూహికంగా వందేమా తరం గీతాలాపన చేసి వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ పలు నినాదాలతో కావలి పురవీధులలో ఘనంగా ర్యాలీ నిర్వహించి, తమ దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుజాత, ఎన్‌సిసి అధికారి మస్తాన్ వలీ, ఉపాధ్యాయులు, ఎన్‌సిసి కేడెడ్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వందేమాతరం గీతం 150ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస రావు విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore.
O.S.No. 311 / 2025

Canara Bank Formally Known as Syndicate Bank,
Aditya Nagar Branch, Nellore City.
represented by its **Branch Manager,** - Plaintiff
Vs
1. Dodla Prasad Reddy
and another - Defendants

Notice

To,
D1. Dodla Prasad Reddy,
S/o **Chandra Sekhar Reddy,**
Sri Vijaya Medicals, Opp. Current Office Center, SPSR Nellore District-524001.
D2. D.Vijayamma, W/o **C.S.Reddy,**
D.No. 16-11-514, Harnathpuram,
SPSR Nellore District-524003.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే20-11-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **94403 90245**

Before The Principal Motor Accidents Claims Tribunal : Nellore.
M.V.O.P.No. 475 / 2025

1. Bheemathati Padmamma
and 3 others - Claimants
Vs
1. Shanmuganand T.K.
(Driver-Cum-Owner)
and another - Respondents

Notice

To,
R1. Shanmuganand T.K.,
S/o **T.Kamalapathi,** owner-cum-driver Car bearing No.22 BH-8422B, residing at B.202, Srinivasa Towers, Ajeez Nagar, VTC, Reddiyarpalayam, Pudicheery Taluk, Puducheery District-605010.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారములు కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే05-12-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

డి.రమేష్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.